సాక్షి
చిత్తూరు
బుధవారం, 20, నవంబర్, 2024



ఉన్నతాశయంతో ముందుకు..

ఎన్‌సీసీ కేడెట్లు ఉన్నతాశయంతో ముందుకు సాగాలని 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మోనిస్ అన్నారు. - 8లో



వైభవం..జ్వాలాతోరణం

చిత్తూరులోని శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జ్వాలాతోరణం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. - 8లో



అదే వేగం.. పడదా కళ్లెం?

చిత్తూరు మెసానిక్ మైదానం రోడ్డులో భారీ వాహనాలు, ఇసుక ట్రాక్టర్లు నిత్యం అతివేగంగా తిప్పుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

దేవస్థానం కోసమే గ్రామ కంఠం వినియోగం

కుప్పం: మండలంలోని బొగ్గుపల్లెలో సర్వే నంబర్ 8/2 లోని 31 సెంట్లు గ్రామ కంఠం భూమిని దేవాలయం కోసం వినియోగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'గ్రామ కంఠం అమ్మేశారు!' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన గ్రామస్తులందరూ ఏకమై తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా శ్రీరాముల దేవాలయం నిర్మించాలని గ్రామస్తులు ప్రయత్నాలు చేసినా పనుల జరగలేదన్నారు. గ్రామంలోని గ్రామం కంఠం భూమి అన్యాక్రాంతం కాకుండా దేవాలయం నిర్మాణం కోసం వినియోగిస్తున్నట్లు వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

వచ్చే నెల 15 లోపు పంటల బీమా నమోదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని రైతులు డిసెంబర్ 15వ తేదీలోపు పంట బీమా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్ దృష్ట్యా ప్రధాన మంత్రి పంటల బీమా యోజన కింద చేపట్టే నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో భూ రికార్డుల ఆధారంగా రైతులు బీమా నమోదు చేసుకోవచ్చన్నారు. రబీలోని సాధారణ పంటలకు డిసెంబరు 15వ తేదీలోపు, జీడిమామిడి సాగుకు 21వ తేదీలోపు, వరి సాగుకు 31వ తేదీలోపు బీమా చేసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతుల వాటా చెల్లింపుపై అవగాహన కల్పించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రైతులు సూక్ష్మ సేద్యం పరికరాలకు తమ వాటాను చెల్లించేలా అవగాహన కల్పించాలని హార్టికల్చర్ అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి హార్టికల్చర్ అధికారులు ఈ వారం లోపు 50 హెక్టార్లకు తక్కువ కాకుండా సూక్ష్మసేద్యం అమలుకు రైతుల వాటాను చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 502 ఆర్‌ఎస్‌కేల పరిధిలో 27,723.46 హెక్టార్లకుగాను 27, 980 మంది రైతుల రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఇందులో 10,962.8 హెక్టార్లలో 11,918 మంది రైతులకు సంబంధించి ప్రాథమిక తనిఖీ పూర్తి చేశారన్నారు. 2,860.74 హెక్టార్లకు 3,314 మంది రైతులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. 1,287.1 హెక్టార్లలో 1,513 మంది రైతులకు బిందు, తుంపర్ల సేద్య పరికరాలు అందించామన్నారు. ఇంకనూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు తమ నాన్ సబ్సిడీని జమ చేసేలా మండల స్థాయి అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఉద్యానవన , ఏపీఎంఐపీ అధికారులు మధుసూదన్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాయితీ యంత్రాలు, పనిముట్లు ఇవ్వాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : రాయితీతో యంత్రాలు, పనిముట్లు అందజేయాలని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ సభ్యులు దేవెళ్ల మురళి కోరారు. ఈ మేరకు జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మురళి మాట్లాడుతూ వడ్డెర జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రాయితీపై పనిముట్లు, యంత్రాలు అందజేయాలన్నారు. యంత్రాల వినియోగం తర్వాత వడ్డెర్లకు ఉపాధి దక్కడం లేదని వాపోయారు. దీంతో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. తాము ఆర్థికంగా, సామాజికంగా, ఉద్యోగపరంగా వెనుకబడి ఉన్నామన్నారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించాలని కోరారు. ఈఎండీ డిపాజిట్ లేకుండా తమకు రిజర్వేషన్ ప్రాతిపదికన 50 శాతం పనులను కేటాయించాలన్నారు. వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్రరాజు, నాయకులు హరిబాబు, సుబ్రహ్మణ్యం, రుద్రయ్య, కుసుమజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ మాత్రమే నిండింది. సోమవారం అర్ధరాత్రి వరకు 62,085 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఇదేమి... సర్వేశ్వరా!

జిల్లా సమాచారం




జిల్లాలో మొత్తం మండలాలు 31

మొత్తం ఎస్‌హెచ్‌జీలు 35,670

సంఘాల్లో సభ్యురాళ్ల సంఖ్య మొత్తం 3.75 లక్షలు

అలవికాని హామీలు.. అమలు చేయలేక ఆడంబరాలు.. ఎలా కోత పెట్టాలన్న ఆలోచనలు.. వెరసి.. స్వయం సహాయ సంఘాల సభ్యుల సమస్త వివరాల సేకరణకు ఆరుపేజీల ప్రశ్నావళి.. గూగుల్ పే, ఫోన్ పే, గ్యాస్ నంబర్ సహా అన్నింటిపై ఆరాకు సర్వేలు.. ఫలితం.. సంఘద్రోహం తప్పదా సర్వేశ్వరా అని అతివల ఆవేదన.. ఇదీ నేటి కూటమి సర్కారు నయామోసం.



- డ్వాక్రా కుటుంబాల సంపాదనపై కూటమి ఆరా?
- కుటుంబంలోని సమస్త సమాచారం ఇవ్వాలట!
- ఇల్లు, కారు, బైకు, స్మార్ట్‌ఫోన్, గ్యాస్ నంబర్ చెప్పాలట
- ఫోన్ పే, జీ పే వివరాలపై ఆరా
- ఆరు పేజీల ప్రశ్నావళితో సమగ్రమైన సర్వేకు సిద్ధం
- మెప్మా, డీఆర్‌డీఏలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు
- ఈ సర్వేతో ఎన్ని సమస్యలు వస్తాయోననే భయంతో సభ్యులు

పలమనేరు: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై కూటమి ప్రభుత్వం డేగకన్ను పెట్టింది. ఇప్పటిదాకా గ్రూపు సభ్యుల కుటుంబాల సంపాదన వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, కుటుంబసభ్యుల వ్యాపారాలు, ఉద్యోగాలు, వారికున్న సదుపాయాలు తదితరాల వివరాల సర్వేకు రంగం సిద్ధమైంది. తద్వారా వీరి ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని భవిష్యత్తులో వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వీరికి ఎలాంటి కోతలు పెట్టాలనే ఆలోచనలతో ప్రభుత్వం ముందుకెళుతోందన్న మాట గట్టిగా వినిపిస్తోంది. ఇందుకు సంబంధించి మెప్మా, డీఆర్‌డీఏలకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందినట్టు తెలిసింది. దీనిపై మున్సిపాలిటీల్లో మెప్మా రిసోర్స్‌పర్సన్లు(ఆర్పీలు), మండలాల్లో సంఘమిత్రల ద్వారా ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు.

ఇంటింటి సర్వేలో ఏం చేస్తారంటే..

గ్రూపు సభ్యులు ఇప్పటి వసరే పొందిన రుణాలు, రుణ బకాయిల చెల్లింపులు, కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఉద్యోగాలు, వారి సంపాదన మార్గాలు, జీవనోపాదులు, ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి, ఎవరైనా జీఎస్టీ చెల్లిస్తున్నారా? వారి వివరాలను ఆరు పేజీల ప్రశ్నావళితో కూడిన సమగ్రమైన సర్వే సాగుతోంది. దీంతోపాటు వారు నివసిస్తున్న ఇల్లు, ప్రైవేటు బీమా వివరాలు, ఇంట్లో ఉద్యోగాలను చేస్తున్న వారు ఎక్కడ ఉంటున్నారు.. వారు జీతాలను సేకరించనున్నారు. దీంతో పాటు గ్రూపు సభ్యురాలు వాడుతున్న ఫోను స్మార్ట్‌ఫోనా లేదా దయల్ ప్యాడ్ అని గమనించనున్నారు. స్మార్ట్‌ఫోన్ అయితే వారి గూగూల్‌పే, ఫోన్‌పే ద్వారా ఇప్పటిదాకా సాగిన డిజిటల్ లావాదేవీలను గుర్తించడం జరుగుతోంది. దీంతోపాటు ఆ ఇంట్లో గ్యాస్ పొందుతున్న వారి పేరు, గ్యాస్ నంబర్లను సైతం సేకరించనున్నారు.

ఇది సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ లాగేనా ?

గతంలో ప్రభుత్వ పథకాలు సవ్యంగా సాగేందుకు సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌ను అమలు చేశారు. ఇందులో ఇంటి విస్తీర్ణం, ఇంటికి నెలకొచ్చే కరెంట్ బిల్లు, ఇంట్లోని సభ్యులెవరైనా ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నారా?, ఎవరైనా ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్నారా? అని తేల్చి వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా చేశారు. ఇప్పుడు దీన్ని పేరు మార్చి గ్రూపుల్లోని మహిళల ఇళ్లల్లో ప్రొఫైల్ యాప్ పేరిట ఈ సమగ్ర ఆదాయాల సర్వేని చేపట్టడంతో గ్రూపు మహిళల్లో ఆందోళనలు తప్పడం లేదు. భవిష్యత్తులో తమకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని వారు భయపడుతున్నారు. ఈ విషయమై స్థానిక మెప్మా అధికారులను వివరణ కోరగా ఈ సమగ్ర సర్వేపై ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ఈ సర్వే ద్వారా గ్రూపు మహిళల కుటుంబాలు బాగుపడ్డాయా? లేదా అని స్పష్టమవుతుందన్నారు. ఇప్పటికీ గ్రూపుల ద్వారా మహిళలు అభివృద్ధి లేకుంటే వారిని ఎలా ఆర్థికంగా బలోపేతం చేయాలన్న విషయమై ప్రభుత్వం ఈ సర్వే ద్వారా చర్యలు తీసుకుంటుందని చెబుతున్నారు. ఏదేమైనా గ్రూపు సభ్యులు మాత్రం ఈ సమగ్ర సర్వేపై ఆందోళన చెందుతున్నారు.



పలమనేరు మెప్మా ఆర్పీలకు కుటుంబ సర్వేపై అవగాహన కల్పిస్తున్న మెప్మా పీడీ రాధమ్మ(ఫైల్)

రాష్ట్రంలో రాజకీయ ప్రేరేపిత కక్షలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్

పూతలపట్టు: కూటమి పాలనలో రాష్ట్రంలో రాజకీయ ప్రేరేపితమైన కక్షలు కొనసాగుతున్నాయని వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం పూతలపట్టు మండలంలోని మూర్తిగానూరులో దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం 'సాక్షి'తో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టడం లేదని, పాత కక్షలను తీర్చుకోవడానికే ఐదు నెలలు పట్టిందని తెలిపారు. దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని మంగళవారం జిల్లా ఎస్పీని కోరగా, తప్పకుండా నిందితులను అరెస్టు చేసి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలపై దాడులు చేశారని నిరసన తెలిపారు. నెలక్రితం పూతలపట్టు మండల కేంద్రంలోని మైనారిటీ కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్ పాలానికి ఉన్న కంచెను తొలగించి అతనిపై దాడిచేశారని తెలిపారు. ఇది ఇలా ఉండగా సీఐ కృష్ణ మోహన్ మాట్లాడుతూ మూడురోజుల్లో నిందితులను పట్టుకుని, మండలంలో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తానని తెలిపారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు 2024–25 ఏడాదికి సంబంధించి మొదటి విడతను ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు అన్‌టైడ్ (పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీరు, క్లాప్‌మిత్ర సిబ్బంది వేతనం) కింద రూ.12.13 కోట్లు, టైడ్ (సీసీ రోడ్లు, కాలువలు, పలు అభివృద్ధి పనులు) రూ.18.19 కోట్లు కలిపి మొత్తం రూ.30.32 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం ఇవ్వాల్సిన ఆర్థిక సంఘం నిధులు రెండో విడతను ఆగస్టులో రూ.29.24 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే.

టీడీపీ బెదిరింపులకు బెదరం

- తాను పార్టీకి తలొగ్గి పనిచేస్తా
- కార్యకర్తలు పోరాట పటిమతో పనిచేయాలి
- టీడీపీ కుట్రలకు భయపడొద్దు... పార్టీ అండగా ఉంది
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

శ్రీరంగరాజపురం: టీడీపీ నేతలు చేస్తున్న కుట్రలు, బెదిరింపులకు తాము ఎట్టి పరిస్థితుల్లో బెదరమని, వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. శ్రీరంగరాజుపురం మండలం కొత్తపల్లిమిట్ట గ్రామంలో మంగళవారం నియోజకవర్గం బూత్ కన్వీనర్ నారాయణరెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఆ పార్టీ శ్రేణులు రాష్ట్రంలో సృష్టిస్తున్న అల్లర్లు, అరాచకాలు తారాస్థాయికి చేరాయన్నారు. టీడీపీ నేతలు అధికార అహంకారంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వరుస దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు రోడ్డుపైకి వస్తే టీడీపీ తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. ఈ తరుణంలో జైలుకు పంపినంత మాత్రాన వైఎస్సార్‌సీపీలో భయపడేవారు ఎవరు లేరని.. టీడీపీ తప్పులను ఎండగట్టడానికి సమయం దగ్గర పడిందనే విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో కార్యకర్తలంతా మమల్ని జైల్లో వేయండంటూ జైల్ భరో కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. సోషియల్ మీడియా వేదికగా టీడీపీ అండ్ కో వైఎస్సార్ కుటుంబంపై చేసిన అభస్యకరమైన పోస్టులపై చంద్రబాబు ఎందుకు పెదవి విప్పలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. రైతుకు ఏటా రూ.20 వేలు, నిరుద్యోగులకు రూ.3 వేలు, తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1,500, మహిళలకు ఉచిత బస్సు ఇలా పలు హామీలను డమ్మీ చేశారన్నారు. ఇలా మోసపూరితమైన వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పోలీసుల ద్వారా వైఎస్సార్ సీపీ శ్రేణులను భయపెడుతూ తప్పుడు కేసులు పెడుతోందన్నారు. ఇక భయపెట్టి అధికారంలోకి కొనసాగాలని చూస్తే..ప్రజలు తిరగబడడం ఖాయమన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తూ పోతుందన్నారు. ప్రజలకు తోడుగా నిలబడి తాము రోడ్ల మీదకు వస్తామన్నారు. ప్రజా హక్కుల పరిరక్షణకు పోరాడుతామన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని పక్షంలో బాధ్యతను నిరంతరం గుర్తు చేస్తూ.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో పోరాటాలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని హెచ్చరించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఆయన పిలుపు లేకుంటే విప్లవకారుడిగా నిలిచిపోయి ఉంటానన్ని చెప్పారు. మహానేత ఆశయాలకు అనుగుణంగా తాను ఎల్లప్పుడూ ఆ తనయుడి విజయానికి తలొగ్గి పనిచేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలు సైతం సమష్టిగా పనిచేసి చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటానన్ని చెప్పారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ జిల్లాలో జీడీనెల్లూరు నియోజకర్గం వైఎస్సార్‌సీపీకి పట్టుగొమ్మలా ఉంటూ వస్తుందని చెప్పారు. అయితే ఈ సారి ఎన్నికల్లో ఈవీఎం మోసంతో ఓటమి చూడాల్సి వచ్చిందన్నారు. పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి మాట్లాడుతూ జీడీ నెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అన్నారు. కొన్ని తప్పులతో ఓటమి చూశామన్నారు. ప్రధానంగా కార్యకర్తల నిరుత్సాహమన్నారు. జరిగిన తప్పులను సరిదిద్దుకుని పార్టీ పటిష్టత కోసం పనిచేద్దామన్నారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసుల అండదండలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషియల్ మీడియా కార్యకర్తలను భయపెడుతున్నారని మండిపడ్డారు. పలువురిపై తప్పుడు కేసులు పెట్టి, అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి అరాచక ప్రభుత్వానికి త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వం కలెక్టర్లను బానిసలుగా వాడుకుంటుందన్నారు. ఈ విషయంపై అధికారులు నోరు విప్పలేని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు.

బాబు పాలనలో భద్రత కరువు



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

చంద్రబాబు పాలనలో మహిళలకు భద్రత కరువైందని నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో బాలికలపై లైంగిక దాడులు పెరిగాయన్నారు. మహిళలకు పూర్తిగా రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలున్నా అవి టీడీపీకి చుట్టంలా మారాయన్నారు. సోషియల్ మీడియాలో పోస్టులు పెడితే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పచ్చ విషం చిమ్ముతూ..కేసులు నమోదు చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు సరిత, బండి నాగరాజిరెడ్డి, మండల అధ్యక్షులు మణి, తులసియాదవ్, శేఖర్‌రాజు, విజయకుమార్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హేమసుందర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, పార్టీ కాపు సంఘం అధ్యక్షుడు విజయబాబు, పార్టీ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, చిన్నమరెడ్డి, కమలాకర్‌రెడ్డి, ధనంజయవర్మ, కుప్పయ్య, జనార్దన్, ధనుంజయరెడ్డి, వెంకటరామిరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్

తవణంపల్లె: జిల్లాలో మినీ గోకులం పథకం కింద పాడి పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. ప్రభాకర్ తెలిపారు. మంగళవారం తవణంపల్లెలోని వెలుగు కార్యాలయంలో పాడి పశువుల షెడ్ల నిర్మాణంపై పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ జిల్లాలోని పాడి రైతులను దృష్టిలో ఉంచుకుని మినీ గోకులం పథకం కింద పాడి పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరు చేయడం జిల్లాలోని రైతుల అదృష్టం అన్నారు. అలాగే తవణంపల్లె మండలానికి ఎమ్మెల్యే చొరవతో జిల్లా కలెక్టర్ రూ.1.36 కోట్లతో 69 పాడి పశువుల షెడ్ల మంజూరు చేసినట్లు తెలిపారు. పాడి పశువుల షెడ్లు మంజూరైన రైతులు కాంట్రాక్టర్లతో సంబంధం లేకుండా సొంతంగా 40 రోజుల్లో షెడ్లు నిర్మించుకోవాలని సూచించారు. రైతులు మొత్తం పెట్టుబడి పెట్టుకోకుండా నాలుగు దశల్లో పనులు చేసుకుంటే చేసిన పనులకు ఎప్పటికప్పుడు ఎం.బుక్ రికార్డు చేయించి బిల్లులు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు మేరకు నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని రైతులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే బిల్లులు మంజూరు చేయమని స్పష్టం చేశారు. ఆరు పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.2.30 లక్షలు, నాలుగు పాడి ఆవుల షెడ్డు నిర్మాణానికి రూ.1.85 లక్షలు, రెండు ఆవుల షెడ్డు నిర్మాణానికి రూ.1.15 లక్షలు, 20 గొర్రెల షెడ్డు నిర్మాణానికి రూ.1.30 లక్షలు, 50 గొర్రెల షెడ్డు నిర్మాణానికి రూ.2.30 లక్షలు, 100 కోళ్లు పోషించడానికి షెడ్డు నిర్మాణానికి రూ. 87 వేలు, 200 కోళ్లు పోషించడానికి షెడ్డు నిర్మాణానికి రూ.1.32 లక్షల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. నాలుగు స్టేజీల్లో పనులకు స్టేజీ స్టేజీకి బిల్లులు చేస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ డీడీ ఆరీఫ్, ఐరాల ఏడీ పద్మావతి, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఏపీఓ లలిత, జేఈ వెంకటరమణారెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య పాల్గొన్నారు.

సైనికుల సేవలు మరువలేనివి

- ఈ-బైక్ ర్యాలీని ప్రారంభించిన ట్రైనీ కలెక్టర్ హిమవంశీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

చిత్తూరు కలెక్టరేట్ : దేశ రక్షణ కోసం అనునిత్యం పోరాడే సైనికుల సేవలు ఎన్నటికీ మరువలేనివని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ ఆఫ్ డిఫెన్స్ ఈ-బైక్ ర్యాలీ మంగళవారం చిత్తూరుకు విచ్చేసింది. జిల్లా కేంద్రంలోని పోలీసు మైదానం వద్ద బైక్ ర్యాలీని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఏఎస్పీ ఆపరేషన్స్ రాజశేఖర్‌రాజు జెండా ఊపి ప్రారంభించారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ సైనిక సేవ ఎంతో గొప్పదన్నారు. సైనికులు తమ కుటుంబాలను సైతం వదిలి దేశ రక్షణకు విధులు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. దేశంలోని ప్రజలు పోలీసుల సేవలను ప్రత్యక్షంగా చూస్తారని, అయితే సరిహద్దుల్లో పనిచేసే సైనికుల త్యాగాలను చాలా మంది చూడలేరన్నారు. కనిపించని నిజమైన హీరోలు సైనికులని కొనియాడారు. సైనికుల త్యాగం వెనుక ఎన్నో కలలు, బాధలు, ఆశలు ఉంటాయన్నారు. సైనికుల త్యాగాల ప్రతిఫలమే మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ అని చెప్పారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ మాజీ సైనికులు, వీరనారీలు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీ ఉద్దేశం ఎంతో గొప్పదని కొనియాడారు. దేశానికి రక్షణ కవచంలా నిలిచే సైనికులు నిజమైన దేశభక్తులన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా సరిహద్దుల్లో తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు మాట్లాడుతూ నిజమైన స్వాతంత్ర్యమంటే స్వేచ్ఛను పొందడమే కాకుండా దాన్ని కాపాడుకోవడమని, సైనికుల త్యాగాలు స్ఫూర్తినందిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రతి పౌరుడు సైనికుల త్యాగాలను గుర్తించి, వారికి గౌరవం ఇవ్వాలని తెలిపారు. అనంతరం మాజీ సైనికులు, వీరనారీల సమస్యలను పరిశీలించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ నోయెల్ వికాస్ మొనిస్, 95 ఏళ్ల ఎంఈజీ మాజీ సైనికుడు కెప్టెన్ చొక్కలింగ, సూపరింటెండెంట్ రజాక్ ఖాన్, వరదరాజులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనాల చోరీ కేసులో ఒకరికి జైలు

చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన కేసులో గోవిందరాజులు అనే నిందితుడికి ఆరునెలలు జైలుశిక్ష విధిస్తూ చిత్తూరు ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉమాదేవి కథనం మేరకు.. బంగారుపాళెంలో గతేడాది జూన్ 17, 25వ తేదీల్లో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. బాధితులు గిరిబాబు, రాజ అనే ఇద్దరిని బంగారుపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ చోరీలకు పాల్పడింది యాదమరి మండలం కీనాటంపల్లెకు చెందిన గోవిందరాజులుగా గుర్తించారు. నిందితుడి నుంచి ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి డి.ఉమాదేవి తీర్పునిచ్చారు.

ఇన్వర్టర్ల వేలం నేడు

కాణిపాకం: పూతలపట్టు మండలం వడ్డేపల్లెలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపోలో బుధవారం మూడు ఇన్వర్టర్లను బ్యాటరీల సహా విక్రయానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్న వేలంపాటదారులు ముందస్తుగా రూ. 5వేలు డిపాజిట్ చెల్లించి, పాటలో పాల్గొన్నవచ్చని ఆయన పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతాలో రూ.1.92 లక్షలు కట్

-పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

పలమనేరు: త న ప్రమేయం లేకనే తన ఖాతాలోని రూ.1.92 లక్ష లు కట్ అయ్యాయని పెద్దపంజాణి మండలం బొమ్మరాజుపల్లెకు చెందిన గురుమూర్తి అనే బాధితుడు మంగళవారం స్థానిక పోలీసులకు పిర్యాదు చేశాడు. తాను పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఖాతాదారుడిగా ఉంటున్నానని తెలిపారు. తన ఖాతాలో నుంచి ఈ నెల 15వ తేదీన రూ.99 వేలు, ఈనెల 16న రూ.99వేలు, రూ.1999 మొత్తం రూ.1.92లక్షలు డెబిట్ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్‌పేలో వచ్చిన మెసేజ్‌లను గమనించి తాను తెలుసుకున్నానని తెలిపారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కారు కిందపడి భార్య దుర్మరణం

-భర్తకు గాయాలు

గంగవరం: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో భార్య దుర్మరణం చెందగా బైరెడ్డిపల్లి మండలం చుక్కోనితోపు గ్రామం నుంచి కృష్ణప్ప(41), సుమమ్మ(36) దంపతులు బైక్‌లో నంగిళిలో పెళ్లికి హాజరయ్యేందుకు బయలుదేరారు. పలమనేరు-బెంగుళూరు జాతీయ రహదారిలోని గండ్రాజుపల్లి సమీపంలో బెంగుళూరు వైపు వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనం రెండూ పక్కపక్కనే వెళ్తున్నాయి. రెండు వాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి గుద్దుకోగా బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ బైక్ నుంచి కింది పడిపోయారు. ఈ ప్రమాదంలో సుమమ్మ తలపై కారు దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.. కృష్ణ స్వల్ప గాయాలతో బయటడ్డాడు. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదే వేగం.. పడదా కళ్లెం?

రోడ్డు ప్రమాదాలు ఏ సమయంలో ఎక్కువగా జరుగుతాయంటే రాత్రి వేళల్లో నిద్రమత్తులో అని ఠక్కున సమాధానం వస్తుంది. అయితే చిత్తూరుకు తలమానికంగా ఉన్న మెసానిక్ మైదానం రోడ్డులో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నం. ఈ దారిలో పగలే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల కంటే రోడ్డుపైనే ఎక్కువ. పొగాకు ఉత్పత్తుల మత్తు.. లైసెన్స్ లేని యువత డ్రైవింగ్.. ఫిట్‌నెస్ లేని ట్రాక్టర్లు.. మితిమీరిన వేగమే కారణం. దీనికి కళ్లెం పడేదెప్పుడోనని జనం ఆవేదన చెందుతున్నారు.

"చిత్తూరు నగరంలోని ఫారెస్టు-మెసానిక్ మైదానం రోడ్డులో నాలుగు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై తన కుమారుడిని తీసుకెళుతున్న తల్లిని అతి వేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ చక్రం కింద పడ్డ ఎనిమిదేళ్ల పిల్లాడి తల ఛిద్రమైంది. పోలీసుల విచారణలో తేలిందేమిటంటే..? ఈ ట్రాక్టర్‌కు పర్మిట్ లేదు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదు. ఇన్సూరెన్స్‌లేదు."

"మెసానిక్ మైదానం రోడ్డులో భారీ శబ్దాలు చేస్తూ, అసలు రోడ్డుపై నడిచి వెళుతున్న వారిని ఢీకొట్టేస్తాయేమో..? అనే భయభ్రాంతులకు గురి చేస్తూ ఇసుక ట్రాక్టర్లు హల్‌చల్ చేస్తున్నాయి. ఆ వేగం ఏ మాత్రం తగ్గడంలేదు."

- చిత్తూరులో ఇసుక ట్రాక్టర్ల హల్‌చల్
- ఇప్పటికే ఓ బాలుడ్ని బలిగొన్న ఇసుక ట్రాక్టర్
- భయభ్రాంతులకు గురవుతున్న జనం
- డ్రైవింగ్ లైసెన్సులు.. పర్మిట్లు..ఎఫ్‌సీలు నిల్
- రవాణాశాఖ.. పోలీసు అధికారుల చోద్యం

చిత్తూరు అర్బన్: నగరంలోని రిజర్వు ఫారెస్టు - మెసానిక్ మైదానం రోడ్డువైపు రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలు, ట్రాక్టర్లను అతివేగంగా తిప్పుతున్నారు. ఈ రోడ్డుపై ట్రాఫిక్ తక్కువగా ఉంటుందని, వాహనాలను ఆపి తనిఖీ చేయరనే ధీమా ఉంది. పైగా వేలూరు వైపు వెళ్లాలన్నా, బెంగళూరు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాలన్నా వాహన చోదకులు మెసానిక్ మైదానం రోడ్డునే ఎంచుకుంటున్నారు. అయితే ఉదయం 7 నుంచి 9 గంటల మధ్యలో ఈ రోడ్డు వైపు గిరింపేట, చామంతిపురం, దుర్గానగర్ కాలనీ, ప్రశాంత్ నగర్, సీబీ రోడ్డు, కొండమిట్ట వైపు ఉన్న ప్రజలు వారి పిల్లల్ని పాఠశాలలకు తీసుకెళుతుంటారు. ఇందులోనూ పిల్లల తల్లులు ఎక్కువ మంది కనిపిస్తుంటారు. ఇలా వెళుతున్న సమయంలో ఒక్కొక్కసారి ఇసుక ట్రాక్టర్లు, భారీ వాహనాల వేగాన్ని చూసి, ద్విచక్రవానాలు నడిపేవారు కంగారుతో కింద పడిపోతున్నారు. మరికొన్నిసార్లు వేగంగా వెళుతున్న వాహనాలు, ద్విచక్రవాహనాలను ఢీకొట్టి, ఆపకుండానే వెళ్లిపోతున్నాయి.

చర్యలు తీసుకోరా..?

నిత్యం రోడ్డుపై స్కూటర్లను తనిఖీలు చేస్తూ జరిమానాలు విధించే పోలీసులు మెసానిక్ మైదానం రోడ్డుపై భయభ్రాంతులకు గురిచేస్తూ వెళ్లే ఇసుక ట్రాక్టర్లపై దృష్టి సారించి, ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లను చూస్తే మైనర్లను తలపిస్తుంటారు. ట్రాక్టర్లలో పెద్ద పెద్ద శబ్దాలతో పాటలు పెట్టుకుంటూ, పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు నములుతూ ఆ మత్తులో ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతుంటారు. ఇలా చేయడంతో నిత్యం ఈ రోడ్డులో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనికితోడు ఇక్కడే రైల్వే గేటు ఉండడంతో.. ఎక్కడ రైలు వచ్చేప్పుడు గేటు మూసేస్తారో..? అనే కంగారులో కూడా అధిక వేగంతో వాహనాలను నడుపుతుంటారు. ప్రాణాల పైకి లేస్తున్నాయన్న తరహాలో వెళుతున్న వాహనాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



చిత్తూరులో ట్రాక్టర్ ఢీకొట్టడంతో చనిపోయిన కుమారుడి మృతదేహం వద్ద ఓ తల్లి రోదన (ఫైల్)

రైల్వేబ్రిడ్జి.. ప్రతిపాదనలకే పరిమితం

చిత్తూరు మెసానిక్ మైదానం రోడ్డుపై నిత్యం వాహనాల రాకపోకల సంఖ్య పెరుగుతూనే ఉంది. రోజుకు 50కి పైగా రైళ్లు ఇదే మార్గంలో వస్తూ, పోతూ ఉండడంతో నిత్యం రైల్వే గేటు పడుతోంది. దీనివల్ల సమయం కూడా వృథా అవుతోంది. ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను నిర్మించాలనే ప్రతిపాదన చాలాకాలంగా వినిపిస్తోంది. కానీ ఎవరూ ఈ అంశంపై దృష్టి సారించడం లేదు. ఇప్పుడు రోడ్డు ప్రమాదాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో పాఠశాలల సమయాల్లో ఈ మార్గంలో ట్రాక్టర్లతో పాటు భారీ వాహనాలను అనుమతించొద్దని ప్రజలు సామాజిక మాధ్యమాల వేదికగా డిమాండ్ చేస్తున్నారు.

అలా చేస్తే కేసులు నమోదు..



అతి వేగం ఎక్కడైనా తప్పే. మెసానిక్ మైదానం రోడ్డులో ట్రాక్టర్ల అతి వేగంపై ప్రజల నుంచి పలు సూచనలు, ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ఫోకస్ పెడుతున్నాం. రికార్డులు లేకుండా వెళ్లే ట్రాక్టర్లను సీజ్‌చేసి, ఆర్టీఓకు పంపిస్తాం. ఇక అతివేగంగా వాహనాలు నడిపేవారు, డ్రైవింగ్ లైసెన్సు లేనివారు, ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తాం. రెండు రోజుల్లో ఈ ప్రక్రియ మొదలవుతుంది.

- నిత్యబాబు, సీఐ, చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

ఉన్నతాశయంతో ముందుకు సాగాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌సీసీ కేడెట్లు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలని 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోనిస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు మైదానంలో మంగళవారం శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కేడెట్లకు శిక్షణా శిబిరంలో ఎన్‌సీసీ మెళకువలు నేర్పించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో ప్రతిభ చూపిన కేడెట్లకు బహుమతులు అందించామన్నారు. అనంతరం శిక్షణలో కేడెట్లు నేర్చుకున్న అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కేడెట్లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మేజర్ లోకనాథమ్, ఎన్‌సీసీ ఆఫీసర్లు ప్రసాద్ రెడ్డి, ఈశ్వరరావు, యుగంధర్, మహేష్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వం విద్యాసంస్థకు జాతీయ అవార్డు



నటి అదాశర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థకు ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్-2024 జాతీయ అవార్డు లభించింది. ఈ అవార్డును బెంగళూరులో ప్రముఖ బాలీవుడ్ నటి అదా శర్మ చేతుల మీదుగా ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి అందుకున్నారు. గత 34ఏళ్లుగా స్కూల్ సిలబస్‌తో పాటు సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉత్తమ శిక్షణ అందిస్తూ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నందుకు మై బ్రాండ్ బెటర్ సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు విశ్వచందన్‌రెడ్డి తెలిపారు.

వైభవం.. జ్వాలాతోరణం



జ్వాలాతోరణంలో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలో వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకాలభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో జ్వాలాతోరణంను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలస్థానంలోని స్వామివారికి రుద్రాభిషేకం చేసి, విశేషాలంకరణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి జ్వాలతోరణం నిర్వహించారు. అనంతరం స్వామివారిని నగర వీధుల్లో ఊరేగించారు. కార్తీక మాసంలో జ్వాలాతోరణం చాలా శ్రేష్ఠమైందని ట్రస్టు చైర్మన్ వెంకటేష్ పేర్కొన్నారు. ప్రధాన అర్చకులు శివకుమార్ పాల్గొన్నారు.

డబ్బులిస్తారా లేదా యూట్యూబ్‌లో పెట్టమంటారా?

- అరాచకం సృష్టిస్తున్న కొందరు యూట్యూబర్లు
- వీరి బ్లాక్‌మెయిళ్లపై విసిగి డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు
- ఫిర్యాదు చేస్తే అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్న పోలీసులు



యూట్యూబర్లపై పలమనేరు డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పలమనేరు: 'మీ వీడియోలు మా వద్ద ఉన్నాయి.. అడిగినండ డబ్బులిస్తారా.. లేదా యూట్యూబ్‌లో లింకులు పెట్టమంటారా?'. అంటూ పలమనేరులో వండర్ టీవీ పేరిట బ్లాక్‌మెయిల్ చేస్తున్న భార్యాభర్తలు రాయుడు, షాహీనా, కే న్యూస్‌కు చెందిన ఓ యువకునిపై పట్టణానికి చెందిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు మంగళవారం డీఎస్పీ ప్రభాకర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఎవరు పడితే వారు వీడియోలు తీసి, బ్లాక్ మెయిల్ చేసినప్పుడు బాధితులు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రాథమిక వైద్యం అందిస్తున్న తమ సెంటర్ల వద్దకు వైద్యం కోసం వచ్చినట్టు వచ్చి, రహస్యంగా సెల్‌ఫోన్లతో వీడియోలను తీసి, ఆపై తమను బెదిరించి డబ్బులివ్వకుంటే తమపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, వీడియోలను యూట్యూబ్‌లో పెడతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వీరు పట్టణంలోని మెడికల్ దుకాణాలు, వైద్యులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇసుకను అక్రమ రవాణా చేసేవారు, పర్మిట్ లేకుండా చెట్లను కోసేవారిని టార్గెట్ చేసి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇంకా వీరి అక్రమాలపై చెప్పుకోని వారు భారీగా ఉన్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్, కోర్టుల వద్ద కాపు కాచి అక్కడికొచ్చే అమాయకులకు తాము మీడియా వారమని నమ్మబలికి వారిని ఏమార్చి డబ్బులు గుంజుతున్నట్టు తెలిపారు. వీరి బారిన నియోజకవర్గంలోని హాస్టళ్ల వార్డెన్లు భారీగా సమర్పించుకున్నట్టు తెలిపారు. బాధితులు దిల్షాద్, వాసు, రెహానాబీ తదితరుల ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై డీఎస్పీ విచారణకు ఎస్‌ఐని ఆదేశించారు.

వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేర్వేరు కేసుల్లో ఏడుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితులను కోర్టుల్లో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు.

సారా కేసులో ఇద్దరు..

చిత్తూరు అర్బన్: నగర శివారులో సారా విక్రయిస్తున్న మహేష్‌బాబు (47), సుదర్శనం (52) అనే ఇద్దరు నిందితులను తాలూక పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఎస్‌ఐ రమేష్ తన సిబ్బందితో కలిసి మాపాక్షి కూడలి వద్ద తనిఖీలు చేపట్టారు. ఇద్దరు నిందితులు రెండు క్యాన్లను తీసుకెళుతుండగా అనుమానం వచ్చి పరిశీలించారు. ఆ క్యాన్లలో సారా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. గాజులపల్లెకు చెందిన మహేష్‌బాబు, మాపాక్షికి చెందిన సుదర్శనంను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా.. వారిని రిమాండుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించడంతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

చోరీ కేసులో ఇద్దరు మహిళలు..

చౌడేపల్లె: ఆర్టీసీ బస్సులో బంగారు చైను చోరీ కేసులో ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు సీఐ రాంభూపాల్ మంగళవారం తెలిపారు. సోమవారం పుంగనూరుకు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ విశ్రాంత ఉద్యోగి సరస్వతమ్మ బస్సులో సదుం గ్రామానికి వెళుతుండగా బ్యాగులో దాచిన బంగారు గొలుసు చోరీ అయిన విషయం పాఠకులకు తెలిసిందే. తమదైన శైలిలో విచారణ చేపట్టిన పోలీసులు, చిత్తూరు టౌన్ ఓబనపల్లె కాలనీకు చెందిన జ్యోతి, సరోజ చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని చోరీ చేసిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నగను బాధితురాలు సరస్వతమ్మకు అందజేశామని పేర్కొన్నారు. నిందితులను పుంగనూరు కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు సీఐ రాంభూపాల్ తెలిపారు.




నిందితుల అరెస్టు చూపుతున్న తాలూక పోలీసులు

అక్రమ మద్యం కేసుల్లో ముగ్గురు..

పుంగనూరు: జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చౌడేపల్లె మండలంలో జరిపిన దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేసి, అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. చౌడేపల్లె మండలం దాదేపల్లి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 20 బాటిళ్లను స్వాధీనం చేసుకుని, రవి జెట్టిని అరెస్టు చేశామన్నారు. అలాగే చుక్కావారిపల్లి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 13 బాటిళ్లను స్వాధీనం చేసుకుని గంగాధర్‌ను అరెస్టు చేశామన్నారు. బోయకొండ వద్ద దాడులు జరిపి అక్రమంగా నిల్వ ఉంచిన 21 బాటిళ్లను సీజ్ చేసి, రమేష్‌ను అరెస్టు చేశామన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు జవహార్ బాబు, సతీష్ , ఎస్‌ఐలు వేణుగోపాల్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


ముదరంపల్లి సర్పంచ్.. చెక్‌పవర్ పునరుద్ధరణ

పలమనేరు: నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం ముదరంపల్లి సర్పంచ్ మంగమ్మ చెక్‌పవర్ పునరుద్ధరిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఆ మేరకు ఆ మండల ఎంపీడీఓ బాలాజీ ద్వారా ఈ ఆదేశాలు అందాయి. గతంలో పంచాయతీకి చెందిన వేమారెడ్డి, సుష్మాకీర్తి ఇద్దరూ కలిసి ముదరంపల్లెలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు చేపట్టారు. అయితే వారిద్దరి మధ్య విభేధాలు రావడంతో నిధుల చెల్లింపు విషయమై వేమారెడ్డి, సుష్మాకీర్తి హైకోర్టులో కేసు దాఖలు చేశారు.దీంతో అప్పటి డీపీఓ లక్ష్మి స్థానిక సర్పంచ్ మంగమ్మకు చెక్ పవర్‌ను రద్దు చేశారు. ఇలా ఉండగా చెక్‌పవర్‌ను పొందిన అధికారులు పంచాయతీ నిధులను వేమారెడ్డికి మాత్రమే చెల్లించారు. దీనిపై అక్కడి సర్పంచ్ తనకు చెక్‌పవర్ లేనప్పుడు ఇద్దరికీ చెల్లించాల్సిన బిల్లులను అధికారులు ఏకపక్ష్యంగా వ్యవహరించి, ఒక్కరికి మాత్రం ఎలా చెల్లిస్తారని ఇటీవల జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించింది. దీనిపై సమగ్రమైన విచారణ చేపట్టిన కలెక్టర్ ఇకపై సర్పంచ్ మంగమ్మకు చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలని ఆదేశాలను జారీ చేశారు.



ముదరంపల్లి సర్పంచ్‌కు చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ కలెక్టర్ జారీ చేసిన ఆదేశాల కాపీ

కలెక్టర్‌కు కృతజ్ఞతలు



మా గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు చెక్‌పవర్ ఇవ్వడంతో న్యాయం గెలిచిందని, ఇందుకు కారణమైన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలను తెలుపుతున్నాం. అధికారం చేతిలో ఉందని, వారి ఇస్టానుసారంగా అధికారుల ద్వారా ఆదేశాలను జారీ చేయించినా ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని కలెక్టర్ ఆదేశాలతో స్పష్టం అయ్యింది.

-సుష్మాకీర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు, పెద్దపంజాణి

కూలిరేట్ల అగ్రిమెంట్ అమలు చేయాలి

- కలెక్టరేట్ వద్ద సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్ల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : కూలిరేట్ల అగ్రిమెంట్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్ల యూనియన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. రేట్లు పెంచాలని పలు మార్లు మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగి సమస్యలను విన్నవించినా ఎలాంటి ఫలితం లేదన్నారు. హమాలీల కష్టాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని దుయ్యబట్టారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ మొదట్లో రూ.2తో ప్రతిపాదనలు పెట్టి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారన్నారు. అది వద్దని కనీసం గత సంవత్సరం పెరిగినంత పెంచాల్సిందేనని యూనియన్ తరపున గట్టిగా మాట్లాడితే అప్పుడూ రూ.3 ప్రతిపాదనలు పంపారని తెలిపారు. అయితే ఆ ప్రతిపాదనలను ప్రభుత్వం ఇంత వరకు ఆమోదించలేదని చెప్పారు. సమస్యను పరిష్కరించకపోతే సమ్మె నోటీసు ఇచ్చి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రతి నెలా 5వ తేదీ జీతాలు ఇవ్వాల్సి ఉంటే 19వ తేదీ పూర్తి అయినా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం హమాలీల సమస్యలను పరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో నాయకులు రమాదేవి, రఘు, కృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సివిల్ సప్లైస్ హమాలీలు